క్లుప్తంగా

వ్యాపారంతో పది మందికి ఉపాధి కల్పించొచ్చు

ఐడీసీ చైర్మన్ సముద్రాల వేణుగోపాలాచార్యులు

బాలానగర్: యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా సొంతంగా వ్యాపారం ప్రారంభించటం అభినందనీయమని కేంద్ర మాజీ మంత్రి, ఐడీసీ చైర్మన్ సముద్రాల వేణుగోపాలాచార్యులు అన్నారు. సోమవారం బాలానగర్ డివిజన్‌లోని నర్సాపూర్ చౌరస్తాలో వేణు అనే విద్యాధికుడు ఏర్పాటు చేసిన శ్రీ వేద నరసింహ కన్సల్టెన్సీను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య పూర్తయిన తరువాత ఉద్యోగం కోసం చూడకుండా సొంతంగా వ్యాపారం చేస్తూ పదిమందికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ముందుకు కొనసాగటం మంచిదన్నారు. టూల్స్, డిజైన్స్, వ్యవసాయ పనిముట్లు తయారీపై సేవలు అందిస్తామని నిర్వాహకుడు వేణు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కాండూరి నరేంద్రాచార్య, ప్రవీణ్, కృష్ణమాచార్యులు, శేషం రఘుకిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ కాలనీలో శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలోని శ్రీకార్యసిద్ధి అభయాంజనేయస్వామి వారి ఆలయ వార్షికోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పాల్గొని ఆంజనేయ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో కాలనీవాసులు నర్సయ్య, దేవినేని ప్రసాద్, నాని, బీఆర్‌యస్ పార్టీ నాయకులు లక్ష్మారెడ్డి, ప్రసాద్, వెంకటేశ్వరరావు, దామోదర్, పోశెట్టిగౌడ్ తదితరులు ఉన్నారు.

మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించాలి

మాదాపూర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం మాదాపూర్‌లోని న్యాక్ ప్రాంగణంలో డైరెక్టర్ జనరల్ కె.భిక్షపతి ఆధ్వర్యంలో సంస్థ ఉద్యోగులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని, పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. మహిళలు ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలని, వారు స్వశక్తితో ఎదుగుతూ ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాక్ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ శాంతిశ్రీ, ప్రియ తదితరులు పాల్గొన్నారు.

వర్సటైల్ ఎగ్జిబిషన్



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి భాగ్యనగర్ మోడల్ స్కూలులో వర్సటైల్ ఎగ్జిబిషన్‌ను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు రకరకాల పరికరాలతో అనేక ప్రయోగాలు చేశారు. ముఖ్యంగా విజయనగర సామ్రాజ్యం, రామాయణంలో వివిధ పాత్రలతో చేసిన నాటిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ డొల్ల మల్లేష్, చైర్‌పర్సన్స్ రవిచంద్రన్ సాయి, చంద్రలేఖ, ప్రిన్సిపాల్ సుస్మిత, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్యాస్ ధర తగ్గించాలి

మియాపూర్: పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని మియాపూర్‌లోని స్టాలిన్‌నగర్‌లో ఏఐఎఫ్‌డీడబ్ల్యూ ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌డీడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు ఎం.రాణి మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చే నాటికి రూ.410 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర నేడు రూ.1185కు చేరిందన్నారు. కరోనా సంక్షోభంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, నిత్యావసర వస్తువుల ధరలు పెంచి వారిని మరిన్ని ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు.

వ్యాసరచన పోటీలు



మూసాపేట: మూసాపేటలోని పంచశీల ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు ప్రశంసపత్రాలు అందజేశారు. 'మానవసేవే మాధవ సేవ'అనే అంశంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. తోటి వారికి సహాయం, సేవ చేయడంతో మానవ జన్మకు సార్థకత చేకూరుతుందన్నారు.

తెలంగాణలో ఫాస్ట్‌ట్రాక్ అభివృద్ధి

- కూకట్‌పల్లికి రికార్డు స్థాయిలో నిధులు
- నియోజకవర్గంలో వేల కోట్లతో అభివృద్ధి
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కూకట్‌పల్లిలోని శేషాద్రినగర్‌లో జరిగిన బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న నాయకులు

కూకట్‌పల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే తెలంగాణ ఫాస్ట్‌ట్రాక్ అభివృద్ధి జరిగిందని కూకట్‌పల్లిలో మూడు దశాబ్దాలను మరిపించే విధంగా అభివృద్ధి చేశానని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. కూకట్‌పల్లి డివిజన్‌లోని శేషాద్రినగర్ కమ్యూనిటీహాల్‌లో జరిగిన బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూకట్‌పల్లిలో ప్రజల కోసం తాను నాలుగు దశాబ్దాలుగా పనిచేస్తున్నానని ప్రజల సమస్యల పరిష్కారంలో తాను ఎన్నడూ రాజీ పడలేదని తెలిపారు.

- కూకట్‌పల్లి బిడ్డగా జన్మించినందుకు కూకట్‌పల్లి ప్రాంతాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రికార్డు స్థాయిలో నిధులను తీసుకువచ్చి అభివృద్ధి చేశానన్నారు. ప్రభుత్వంతో సంబంధం లేకుండా కూడా తాను పేద విద్యార్థుల కోసం విద్యావసరాల కోసం తన స్నేహితుల సహకారంతో ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నానని తెలిపారు. తాను ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నందుకే కొంతమంది తనపై వ్యక్తిగత దూషణలకు పాల్పడినా తాను ఎన్నడూ వెనక్కు వెళ్లనన్నారు.
- నియోజకవర్గంలో ప్రజల అభిమానం ఉన్నన్ని రోజులు ఎన్ని దుష్టశక్తులు ఏకమైనా తనను ఏమీ చేయలేవన్నారు. తాను కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు ప్రజల కోసమే పనిచేస్తానని తెలిపారు. కొంతమంది కుటుంబాలను, కులాలను, మతాలను అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుకునే వారు శంకరమాన్యాలు పట్టక తప్పదన్నారు.
- తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కూకట్‌పల్లితో పాటు నియోజకవర్గాన్ని వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశానన్నారు. కూకట్‌పల్లి గ్రామంలోని అతి పురాతనమైన రామాలయం, చిత్తారమ్మ, పోచమ్మ దేవాలయానికి సొంత నిధులతో దాతలసహకారంతో పునర్ నిర్మించామని తెలిపారు.
- అదే విధంగా పార్కులు, రోడ్లు, మంచినీరు, విద్యుత్ వంటి అనేక మౌలిక సదుపాయాలతో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది పడకుండా జీవిస్తున్నారన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం అభివృద్ధికి సహకరించిన ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు కృతజ్ఞతలు తెలుపుతున్నాని అన్నారు. అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరించి రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఘన విజయంతో గెలిపించాలన్నారు.
- ప్రతిపక్ష నాయకులు కల్లబొల్లి మాటలు చెబుతూ ఆధారాలు లేని ఆరోపణలు చేస్తూ చెరువులు కబ్జాలకు గురవుతున్నాయని అనడం ఎంతవరకు సమంజసం అన్నారు. దమ్ముంటే ఆధారాలతో నిరూపించాలని బీజేపీ నాయకులే కబ్జాలకు పాల్పడి ఈ విధంగా దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. ఇప్పటికైనా మీకు దమ్ము, ధైర్యం ఉంటే ఆధారాలతో నిరూపించాలని ఇందుకు నేను సిద్ధమని సవాల్ విసిరారు.
- ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, కో-ఆర్డినేటర్ సతీష్ అరోరా, డివిజన్ అధ్యక్షుడు సంతోష్, జనరల్ సెక్రటరీ ప్రభాకర్, ఎస్సీసెల్ అధ్యక్షుడు బొట్టు విష్ణు, భూపతిరావు, వాసు, కర్క పెంటయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్ష కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే, క్షత్రియ యువజన సంఘం నాయకులు

అల్లూరి సీతారామరాజు జీవితచరిత్ర తెలుసుకోవాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకొని సోమవారం క్షత్రియ యువజన సంఘం ఆధ్వర్యంలో కూకట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొన్నారు. 10వ తరగతి విద్యార్థుల పరీక్షలు సమీపిస్తున్నందున వారికి పెన్నులు, ప్యాడ్, కంపాస్‌బాక్స్ కిట్లను అందించారు.

- ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఈ విధంగా కిట్లను అందించడం ఎంతో సంతోషంగా ఉందని క్షత్రియ యువజన సంఘం సభ్యులను వారిని ప్రోత్సహిస్తున్న శ్యామలరాజును అభినందించారు. నియోజకవర్గంలో విద్యార్థులకు తాను హామీ ఇచ్చినట్లుగా పదో తరగతిలో 10/10 సాధించిన విద్యార్థులకు తన సొంత నిధుల నుంచి ఐ ప్యాడ్‌లను అందిస్తానని తెలిపారు.
- తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న ఆశలను విద్యార్థులు నెరవేర్చి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరాలని సూచించారు. అల్లూరి సీతారామరాజు బ్రిటీష్ వారికి ఎదురు నిలబడి ప్రాణత్యాగం చేసిన గొప్ప మహనీయుడన్నారు. అతి చిన్న వయస్సులో దేశం కోసం ప్రాణాలర్పించిన వీరుడని కొనియాడారు. ప్రతి విద్యార్థి అల్లూరి సీతారామరాజు చరితను చదివి తెలుసుకోవాలన్నారు.
- ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, ఎంఈఓ ఆంజనేయులు, క్షత్రియ యువజన సంఘం సభ్యులు శ్యామల రాజు, డీఎస్. రాజు, వరహాల రాజు, సుధీర్ వర్మ, వర్మ, రాము, భీమరాజు, కృష్ణంరాజు తతదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



శ్రీరంగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న మహిళలతో సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి: మహిళలు విజయం సాధించాలంటే దాని కోసం మహిళలు చేసిన కృషి, ప్రతిభ గుర్తించాల్సిన బాధ్యత సమాజంపై ఉందని శ్రీరంగం ఫౌండేషన్ చైర్మన్ డా. సత్యం శ్రీరంగం పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని సోమవారం మూసాపేటలోని దేవిగ్రాండ్ హోటల్‌లో శ్రీరంగం ఫౌండేషన్ కోచైర్మన్ ఇందుమతి శ్రీరంగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు.

- ముఖ్యఅతిథిగా రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎం.సునీతరావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన సంకల్ప్ ఫౌండేషన్ చైర్మన్ గుండ్ర రోజీ, డాన్ బాస్కో చారిటుబల్ ట్రస్ట్ చైర్మన్ మద్ది కనకంరెడ్డి, అడ్వకేట్ మంజుల, ఎంటర్‌ప్రెన్యూర్ గీత, న్యూట్రీషియన్ ఆశను ఘనంగా సన్మానించారు. నిరుపేద మహిళ పద్మకు కుట్టు మెషిన్ అందజేశారు.
- ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ.. మహిళలను గౌరవించే చోట అద్భుత పరిణామాలు ఆవిష్కృతం అవుతాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబంలోని ఆడవారికి ప్రాముఖ్యత వారి మాటలకు విలువ ఇచ్చినప్పుడు సమాజంలో వారికి దక్కాల్సిన గుర్తింపు కూడా దక్కుతుందన్నారు. అన్ని రంగాల్లో మహిళలు ముందుకు వెళ్తున్నా ఎక్కడో ఒక చోట మహిళలు వివక్షతకు గురవుతూనే ఉన్నారన్నారు.
- ఈ కార్యక్రమానికి హాజరైన మహిళలందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పుష్పారెడ్డి, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు దుర్గారాణి, జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, విజయలక్ష్మి, రమాదేవి, జోజోమ్మ, రజిత, జ్యోతి, శోభ, సంధ్య, వరలక్ష్మి, అరుణయాదవ్, రేణుక, తదితరుల పాల్గొన్నారు.

కరాటేలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థికి బంగారు పతకం



రవితేజను అభినందిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అలివేలు మంగమ్మ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న రవితేజ అనే విద్యార్థి షావలిన్ వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ కరాటే చాంపియన్‌షిప్-2023 సంవత్సరానికి వ్యక్తిగత విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం ట్రోఫీ సాధించాడు. ఈ సందర్భంగా సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ అలివేలు మంగమ్మ మాట్లాడుతూ... విద్యార్థులు క్రీడలపట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ అవకాశాలు ఉంటాయని తెలిపారు. క్రీడలు మానసిక ఉల్లాసం, దృఢత్వం కలిగిస్తాయన్నారు. ఏదో ఒక క్రీడలో రాణించినట్లయితే మంచి స్థాయిలో ప్రభుత్వ రంగంలో త్వరగా ఉద్యోగం కూడా పొందే అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. భవాని, అకాడమిక్ కోఆర్డినేటర్ డా. రమేష్‌బాబు, అధ్యాపకులు జి.రవికుమార్, డా. జె. శ్రీనివాసరావు, డా. కె.సాలయ్య, జి.అమరావతి, ఖాదర్‌ఉన్నీసా బేగం, ఎన్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



వేడుకల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్‌లోని లెర్నింగ్ ట్రీ పాఠశాల వార్షికోత్సం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, నీలిమా ఆసుపత్రి నిర్వాహకులు డా. శ్రీనివాస్, డా. నీలిమ, ప్రముఖ రచయిత పార్థసారథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాల్లో ప్రతిభ చూపాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ ప్రియాంక అతిథులను ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ప్రథమ చికిత్స, సీపీఆర్ విధానంపై అవగాహన

కూకట్‌పల్లి: ప్రభుత్వ కళాశాలలో సోమవారం మహిళా సాధికారిత విభాగం, హెల్త్ అండ్ హైజీన్, జాతీయసేవా పథకం విభాగాల ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎన్. అలివేలు మంగమ్మ ప్రారంభించారు. ఉస్మానియ జనరల్ హాస్పిటల్ ప్రొ. డా. ప్రతిభలక్ష్మి హాజరై మాట్లాడారు. విద్యార్థులకు గుండెపోటు వస్తే ఏ విధంగా సీపీఆర్ చేయాలి.? ప్రాణాలు ఏ విధంగా కాపాడలి? అనే దానిపై అవగాహన కల్పించారు. అదే విధంగా ఆకస్మాత్తుగా మంటలు అంటుకున్నప్పుడు, గ్యాస్ సిలిండర్ పేలినప్పుడు, నీళ్లల్లో ప్రమాదవశాత్తు పడిపోయినప్పుడు ఏ విధంగా ప్రతి స్పందించాలన్నారు. కాలిన గాయాలకు ఏ విధంగా ప్రథమ చికిత్స చేయాలనే విషయాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా అకస్మాత్తుగా అపస్మారక స్థితికి గురైనప్పుడు.. గొంతులో ఏమైనా ఇరుక్కున్నప్పుడు ఏ విధంగా స్పందించాలో వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. బి. భవాని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ కళాశాలలో ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించిన ఉస్మానియ జనరల్ హాస్పిటల్ ప్రొ. డా. ప్రతిభ లక్ష్మి తదితరులు

ఐఎస్‌బీలో గ్రాడ్యుయేషన్ డే

రాయదుర్గం: భారతదేశ జాతీయ దృష్టికి అనుగుణంగా ఐఎస్‌బీ కార్యక్రమాలు చేపడుతోందని కేంద్ర కెపాసిటీ బిల్డింగ్ కమిషన్(సీబీసీ) కార్యదర్శి హేమంగ్‌జానీ పేర్కొన్నారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్స్ క్లాస్-2022కు చెందిన 140 మంది విద్యార్థులకు సోమవారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఐఎస్‌బీలో అధునాతన మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లు ఆత్మనిర్భర్ భారత్‌ను రూపొందించాలనే భారత ప్రభుత్వ దృక్పథానికి అనుగుణంగా ఉన్నాయన్నారు. కష్టపడి పనిచేయడం చాలా ముఖ్యమని, అందుబాటులో ఉన్న అవకాశాలను ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

ట్రిపుల్‌ఐటీలో టెక్నాలజీ సమ్మిట్

రాయదుర్గం: స్థానిక భాషల్లో జ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావాల్సిన తక్షణ అవసరం ఉందని ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ లాంగ్వేజ్ టెక్నాలజీస్ రీసెర్చ్ సెంటర్ హెడ్ ప్రొఫెసర్ వాసుదేవ వర్మ అన్నారు. గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లో వికీమీడియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండవ వికీమీడియా టెక్నాలజీ సమ్మిట్‌ను సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలో అనేక రకాల భాషలు మాట్లాడే ప్రజలు పెద్ద సంఖ్యలో ఉన్నారని, ఈ భాషల్లో ఉపయోగకరమైన డిజిటల్ కంటెంట్ మొత్తం లేదన్నారు. వికీపీడియా వంటి క్రౌడ్ సోర్స్ ఎన్‌సైక్లోపీడియాలు ప్రజల జ్ఞానాన్ని పెంపొందించడానికి ఉపయోగపడతాయన్నారు. వికీమీడియా ఫౌండేషన్ చీఫ్ ప్రొడక్ట్ అండ్ టెక్నాలజీ ఆఫీసర్ సెలీనా డెకెల్‌మాన్ వర్చువల్‌గా మాట్లాడుతూ.. స్థానిక భాషల ప్రాముఖ్యతను గుర్తించడం ముఖ్యమన్నారు.

పచ్చదనంలో 'మనూ'కు మొదటి బహుమతి

రాయదుర్గం: రాష్ట్ర ఉద్యానవన శాఖ నిర్వహించిన 7వ గార్డెన్ ఫెస్టివల్, 1వ అర్బన్ ఫార్మింగ్ ఫెస్టివల్‌లో పచ్చదనాన్ని కాపాడినందుకు గాను మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం మొదటి బహుమతి సాధించింది. ఈ సందర్భంగా 'మనూ' ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర హార్టికల్చర్ శాఖ ప్రతినిధుల బృందం జనవరి 23న పచ్చదనం, ప్రకృతి దృశ్యం అభివృద్ధి అంశాలను క్యాంపస్‌లో పరిశీలించారని చెప్పారు. క్యాంపస్‌లో పచ్చదనాన్ని కాపాడుకోవడంలో ఇంజనీరింగ్ విభాగం, హార్టికల్చర్ విభాగం చేస్తున్న కృషిని అభినందించారు.

మహిళా దినోత్సవ నిర్వహణపై జెడ్సీ సమీక్ష



మహిళా దినోత్సవ నిర్వహణ వివరాలు వెల్లడిస్తున్న జెడ్సీ మమత

కూకట్‌పల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 8వ తేదీన చేపట్టాల్సిన కార్యక్రమాలపై కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ వి.మమత సోమవారం ఆదేశాలు జారీ చేశారు. 8వ తేదీ సర్కిల్, జోనల్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకల నిర్వహణ, 9న మహిళల ఆరోగ్యం, భద్రతపై అవగాహన కార్యక్రమాలు, మహిళా ఉద్యోగులు, శానిటేషన్ కార్యక్రమాలు, టీఎల్ఎఫ్, ఎస్ఎల్ఆర్, ఎస్‌హెచ్‌జీ మహిళా గ్రూపులకు కార్యక్రమాలు, జెండర్ కమిటిలు, న్యూట్రిషన్ కమిటీల పునరుద్ధరణ, 10న ఆరోగ్యం పోషకాహార కమిటీలు, మహిళా ఉద్యోగులు, మహిళా షెల్టర్ హోమ్స్ ఖైదీల ప్రత్యేక కంటి వెలుగు కార్యక్రమం, 11న సర్కిల్, జోనల్ స్థాయిలో మహిళా సాధికారతపై అవగాహన, ప్రసంగాలు, న్యాయవ్యవస్థ, పోలీస్, విషయ నిపుణుల నుంచి చర్చా కార్యక్రమం, తగిన ప్రదేశాల్లో ఎస్‌హెచ్‌జీ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయం 12న సర్కిల్, జోనల్‌లోని తగిన ప్రదేశాల్లో ఎస్‌హెచ్‌జీ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయం, అన్ని మహిళా వసతి గృహాల్లో పండ్లు, స్వీట్ల పంపిణీ, 13న తేదీ బ్యాంక్ లింకేజ్ ప్రోగ్రాం, చెక్కుల పంపిణీ, వీధి వ్యాపారులు, మహిళలకు సన్మానం, సర్కిల్, స్థాయిలో క్రీడా కార్యక్రమాలు, 14న అన్ని జోన్, సర్కిల్ స్థాయిలో మహిళా ఉద్యోగులకు క్రీడా కార్యక్రమాలు, 15న అన్ని జోనల్, సర్కిల్ స్థాయిలో పాల్గొనే మహిళా ఉద్యోగులు, ఎస్‌హెచ్‌జీ గ్రూపు, పారిశుద్ధ్య మహిళా కార్మికులు, ఎన్‌జీఓలతో సాంస్కృతిక కార్యకలాపాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పరీక్ష కిట్ల పంపిణీ



బాలానగర్: క్షత్రియ యువజన సంఘం ఆధ్వర్యంలో బాలానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్, కంపాస్ బాక్స్ తదితర పరీక్ష కిట్లను బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అందజేశారు. విద్యార్థులకు ఉపయోగపడే కిట్‌ను అందజేసిన శ్యామలరాజు, యువజన సంఘం నాయకులను అభినందించారు.

దుబారా ఖర్చు తగ్గించుకోమన్నందుకు భార్య ఆత్మహత్య



శ్రీలక్ష్మి (ఫైల్)

భాగ్యనగర్‌కాలనీ: ఖర్చులు తగ్గించుకోవాలని భర్త మందలించటంతో క్షణికావేశంలో భార్య ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన యెండూరు శ్రీలక్ష్మి (29)కి 2019లో రాజశేఖర్‌తో వివాహం జరిగింది. కూకట్‌పల్లిలో వీరు నివాసం ఉంటున్నారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. సంసార జీవితం సాఫీగానే కొనసాగుతోంది. అయితే శ్రీలక్ష్మి డబ్బులు ఆదా చేయకుండా ఇష్టానుసారంగా ఖర్చులు చేస్తుండేది.

- భర్త తనకు వచ్చే జీతం అంతంతమాత్రమేనని ఇలా దుబారా ఖర్చులు చేస్తే జీవితంలో రాణించలేమని భార్యతో పేర్కొన్నాడు. చిన్నచిన్న విషయాలతో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకునేది. ఈ క్రమంలోనే ఆదివారం వారి మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకొంది. దీనితో భర్త హాలులో కొడుకుతో పాటు నిద్రపోయాడు. శ్రీలక్ష్మి తనకు నడుం నొప్పి ఉందని బెడ్‌రూమ్‌లో పడుకుంటానని చెప్పి వెళ్లింది.
- భర్త మందలించటంతో తీవ్ర మనస్థాపానికి గురైన శ్రీలక్ష్మి సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త బెడ్‌రూమ్ తలుపు తట్టగా ఎంతకీ తీయకపోవటంతో స్థానికుల సహాయంతో తలుపులు తెరిచి చూడగా అప్పటికే ఉరివేసుకొని మృతి చెందింది.
- ఈ విషయాన్ని శ్రీలక్ష్మి కుటుంబసభ్యులకు, కూకట్‌పల్లి పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం అందజేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆమె మృతికి గల కారణాలు సేకరించి శ్రీలక్ష్మి సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శేరిలింగంపల్లి అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్నాం

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో సమస్యలను పరిశీలిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ ఫేజ్-1, ఈస్ట్, వెస్ట్ సాయినగర్, రాఘవేంద్ర కాలనీ, తులసినగర్, ఆల్విన్‌కాలనీ ఫేజ్-2, ఆదిత్యనగర్, చక్రధర్‌నగర్, కాకతీయ నగర్, ధరణినగర్, ఉజ్జయిని మహంకాళి నగర్, త్యాగరాజు కాలనీ, పాపమ్మ బస్తీ కాలనీల్లో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులను ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ సోమవారం పాదయాత్ర చేపట్టి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెలే గాంధీ మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని అన్నారు. దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

ఆల్విన్‌కాలనీలో 85 శాతం పనులు పూర్తి

- పాదయాత్రలో స్థానికులు తమ దృష్టికి తీసుకొచ్చిన అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కాలనీల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తామని పేర్కొన్నారు. కాలనీవాసులు కాలనీల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. ఎటువంటి చిన్న సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే ఆల్విన్‌కాలనీలో 85 శాతం పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. మిగిలిన పెండింగ్ పనులన్నీ పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు మెంబర్లు, ఏరియా కమిటీ ప్రతినిధులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.